నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం సెప్టెంబర్ 10, 2023 www.navatelangana.com

రైతులు మళ్లీ రుణాలు పొందాలి

- గోవింద్‌పేట్ సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామాల రైతులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రుణమాఫీ పొందిన రనైతులు.. మరోసారి రుణాలు తీసుకోవచ్చని సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్ శనివారం తెలిపారు. రైతులు మీసేవ నుండి బీఫామ్ తీసుకొని రావాలని, వీటితో పాటు ఆరు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, 4 ఆధార్ కార్డు జిరాక్స్, పాన్‌కార్డ్, పాత పాస్ బుక్ జిరాక్స్‌లతో సొసైటీకి రావాలని తెలిపారు.

నీట్‌లో సత్తా చాటిన మండలవాసులు

- ఒకే ఇంట్లో అక్క తమ్ముడు



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

వైద్య కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలు ఇటీవలే విడుదల అయిన విషయం విదితమే. ఈ పరీక్షలో మండల విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన పాల్కే ఖేతన్ రాష్ట్ర స్థాయిలో 5584 ర్యాంకు సాధించడంతో పాటు అతని అక్క పాల్కే కృప 18230 ర్యాంకు సాధించారు. ఇక పోచారం తండాకు చెందిన గోతి అరుణ్ 4201 సాధించారు. వీరితో పాటు అంజనీ గ్రామానికి చెందిన ఆర్.రగునాథ్‌కు 5673 ర్యాంకు వచ్చింది. దీంతో వీరికి ఆయా జిల్లాలోని మెడికల్ కాలేజీలో సీట్లు సాధించారు.



ప్రథమ చికిత్స ఆలయం ఎదుట ఆందోళన చేపట్టిన స్థానికులు

పసిగుడ్డు ప్రాణం ఖరీదు లక్షా 20 వేలు

- ఆర్ఎంపీ వైద్యంతో రెండు నెలల శిశువు మృతికి వెల
- చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

నవతెలంగాణ-పిట్లం

వచ్చి రాని వైద్యం చేయడంతో రెండు నెలల పసి గుడ్డు మృతి చెందగా స్థానిక నాయకులు పసి గుడ్డు ప్రాణానికి లక్ష 20వేల రూపాయలు ఖరీదు కట్టారు. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని తిమ్మానగర్ గ్రామానికి చెందిన కొక్కొండ అనితకు సుమారు ఆరు సంవత్సరాల క్రితం సంగారెడ్డి జిల్లా మానూర్ మండలంలోని ఏలుగోయా గ్రామానికి చెందిన జైపాల్‌తో వివాహమైంది. కాగా ఆమెకు మొదటి కాన్పులో ఒక బాబు ఉండగా, రెండో కాన్పు నిమిత్తం రెండు నెలల క్రితం అమ్మగారి ఇంటికి వచ్చింది. సుఖ ప్రసవం అయి పండంటి బాబుకు జన్మనిచ్చింది. ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో మండల కేంద్రంలోని శ్రీ భవాని ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆసుపత్రి ఆర్ఎంపి డాక్టర్ రాజు పసి బాబుకు వచ్చిరాని వైద్యం నిర్వహించడంతో అంతలోనే పసి బాబు మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు ఆసుపత్రి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. కుటుంబీకుల రోధనలు విని చలించిన మండల కేంద్రంలోని యువకులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆర్.ఎం.పి డాక్టర్ పై చర్యలు చేపట్టాలని, వచ్చిరాని వైద్యంతో పుట్టగొడుగుల ఆసుపత్రులు పెట్టుకుని ధనార్జన ధ్యేయంగా తమ స్థాయికి మించి ఆపరేషన్లు, కాన్పులు నిర్వహిస్తూ అమాయక పేద ప్రజల నుండి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఇలాంటి వారిపై ఉన్నతాధికారుల చర్యలేవని నినాదించారు. శాంతిభద్రతల దృష్ట్యా స్థానిక ఎస్సై విజయ్ కొండ తన సిబ్బందితో ఆసుపత్రికి చేరుకున్నారు. ఇంతలోనే గ్రామ , మండల నాయకులు చేరుకొని ఆసుపత్రి సిబ్బందితో చర్చలు జరిపి చిట్ట చివరకు పసికందు పాప ప్రాణము విలువ లక్ష 20 వేలకు నిర్ణయించడం గమనార్హం.

సర్వం 'తాకట్టు'

- జోరుగా పేకాట
- అటవీ ప్రాంతాల్లో గుట్టుగా స్థావరాలు
- లక్షల్లో చేతులు మారుతున్న నగదు
- ఇల్లు గుల్ల చేసుకుంటున్న పేకాటరాయుళ్లు
- పొలిటికల్ కనుసైగల్లో కొనసాగుతున్న పత్తాలాట



ఫైల్

నవతెలంగాణ-వర్ని(చందూర్)

గ్రామాల్లో పేకాట జోరుగా సాగుతోంది. స్థావరాలు ఏర్పాటు చేసి మరి పేకాట ఆడిస్తున్నారు. రోజుకూ లక్షల్లో చేతులు మారుతూ పలు కుటుంబాలు రోడ్డుపాలవుతున్నాయి. బైక్‌లు, ఫోన్‌లు, బంగారం లాంటి విలువైన వస్తువులు తాకట్టు పెడుతూ తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. రాజకీయ నాయకుల అండతో జోరుగా సాగుతుండటంతో అధికార, పోలీస్‌యంత్రాంగం చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చందూర్ మండలంలోని ఘనపూర్ గ్రామంలోతో పాటు చందూర్ అటవీ ప్రాంతాలలో పేకాట స్థావరాలు జోరుగా కొనసాగుతున్నాయి. రోజుకు రూ.3 లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల ఆట కొనసాగుతుందని దీనికి అండగా పొలిటికల్ లీడర్స్ ఉన్నారని ప్రతి నోటా ,ప్రతి చోట ప్రజల నుంచి వినిపిస్తుంది. హెూటళ్లలో, గ్రామ రచ్చ బండ వద్ద ఉదయం కూర్చుంటే చాలు పేకాట లో డబ్బులు పోయి, బైక్‌లు, బంగారం, పలు వస్తువులు తాకట్టు పెట్టుకొన్న సంగతులే చెవులు కోరుకుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడ తమ ఇంట్లో వాడు వెళ్తున్నాడో అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇక్కడ పేకాట ఆడటానికి బోధన్, నిజామాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి కొత్తకొత్త వ్యక్తులు వస్తున్నట్టు సమాచారం.

పొలిటికల్ లీడర్‌ల అండతో స్థావరాలు

మండలంలో కొందరు పొలిటికల్ లీడర్లు అండగా పేకాటకు ఉన్నారని అందుకే స్థవరాలు ఏర్పాటు చేసే నిర్వహకులు రెచ్చిపోతున్నారని భోగట్ట. పోలీసులు పట్టుకుంటారనే భయం కూడా లేకపోవడంతో పలువురు పెద్దఎత్తున పేకాట ఆడేందుకు తరలివెళ్తున్నట్టు సమాచారం. పలువురు యువత సైతం పూర్తిగా పేకాటకే పరిమితం అవుతున్నారని ఆరోపణలు. బైకులు, బంగారం తాకట్టుకు తరలిపోతున్నాయి.

దీంతో పాటు ఊర్లో ఉండే పేకాట లీడర్‌కు ఫోన్ చేస్తే.. ఫోన్ పేలో రూ.10,000 పంపుతూ మరుసటి రోజు రూ.12,000 వసూలు చేస్తున్నట్టు వినికిడి. మరుసటి రోజు ఇవ్వకుంటే బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌లు నిత్యకృత్యం అయ్యాయి. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి.

అడ్డా కాపలకు కూలీ రూ.1000, నిర్వహకుడికి ఐదువేలు

పేకాట నిర్వహకుడికి రోజుకు 5000 చెల్లించాలి. పోలీసులు వస్తున్నారా లేదా చేసే వారికి వేయిరూపాయలు కూలీ ఇస్తున్నారు. వీరు నాలుగు దిక్కులు కాపలా కాస్తూ ఉండాలి. వీరికే ఇంత యిస్తే అక్కడ కొనసాగే ఆట ఎంత అంటారా..? లక్షల్లోనే చేతులు మారుతున్నాయి.

గ్రామాలల్లో పలు చోట్ల ప్రజలు ఇంత బహిరంగంగా పేకాట ఆడుతున్నా.. పోలీసులకు కనీస సమాచారం లేకపోవడం, తనిఖీలు చేపట్టకపోవడతో పలు అనుమానాలకు తావిస్తుంది. ఇప్పటికైనా స్పందించి తనిఖీలు చేపట్టాలని, పేకాటపై నిఘా ఉంచి స్థవరాలను గుర్తించి నిర్వహించే వారిపై చర్యలు తీసుకొని యువత భవిష్యత్తును కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.

చివరికి చిక్కిన చిరుత

- అటవీశాఖ బోనులో చిరుత
- నెహ్రూ జువాలజికల్ పార్కుకు తరలింపు
- మరొక చిరుత ఉందంటున్న గ్రామస్తులు

నవతెలంగాణ-నవీపేట్



బోనులో చిక్కిన చిరుత

నవీపేట్ మండలంలోని యంచ గ్రామపంచాయతీ అల్జాపూర్ గ్రామంలో గత ఐదు రోజుల క్రితం చిరుత సంచారం ఉందంటూ అటవీ శాఖ అధికారులు ధ్రువీకరించగా యంచ విఠలేశ్వర ఆలయం సమీపంలో శుక్రవారం రాత్రి చిరుత బోనులో చిక్కింది. గత ఐదు రోజుల క్రితం అల్జాపూర్ గ్రామంలో కనిపించిన చిరుత పశువుల మీద దాడి చేయగా గ్రామస్తుల కోరిక మేరకు అటవీ ఉన్నతాధికారులు అల్జాపూర్ గ్రామ శివారులో చిరుతను పట్టుకునేందుకు కుక్కను ఎరచూపి బోను ఏర్పాటు చేశారు. కాగా యంచ విఠలేశ్వర ఆలయ పూజారికి శుక్రవారం కనిపించడంతో భయాందోళన చెందగా బోనును ఆలయ సమీపంలో ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ భర్త ప్రవీణ్ కుమార్ తో పాటు యువకులు చిరుత సంచారంపై ప్రత్యేక నిఘా వేసి గస్తీ తిరగడం, రాత్రిపూట అడవిలోకి వెళ్లి సైతం ఆచూకీ కోసం తీవ్రంగా కృషి చేశారు. చివరకు చిరుత బోనులో చిక్కడంతో అటవీ శాఖ అధికారుల సహకారంతో జిల్లా కార్యాలయానికి తీసుకెళ్లగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాదులోని నెహ్రూ జువాలజికల్ పార్కుకు తరలించినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. రేంజ్ అధికారి పద్మారావు సెక్షన్ అధికారి జహూర్ ఉల్ హక్, బీట్ ఆఫీసర్ సౌమ్య తదితరులు ఉన్నారు. అయితే మరో చిరుత సైతం ఉందంటూ గ్రామస్తులు పేర్కొంటున్నారు.

15న మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం : కలెక్టర్ జితేశ్ వి పాటిల్





పనులు పూర్తిచేయడంపై సూచనలిస్తున్న కలెక్టర్... సిద్ధమవుతున్న మెడికల్ కాలేజీ

నవతెలంగాణ-తాడ్వాయి(కామారెడ్డి)

ఈ నెల 15న వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుతం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యాతనిస్తూ పలు జిల్లాలకు మెడికల్ కళాశాలలు మంజూరు చేయగా, నిర్మాణాలు పూర్తై 2023-24 సంవత్సరం మొదటి సంవత్సరం బ్యాచ్ కు ప్రవేశాలు ప్రారంభమైన 9 జిల్లాలో తరగతులను ప్రారంభించుటకు గాను వైద్య కళాశాలలను రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఈ నెల 15 న వర్చువల్ పద్ధతిన ప్రారంభిస్తున్న సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో నిర్మిస్తున్న వైద్యకళాశాలలో జరుగుచున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటా ్డుతూ వైద్య కళాశాలలో పురోగతిలో ఉన్న పనులను, వసతి గృహ పనులను యుద్ధప్రాతి పదికన పూర్తి చేస్తున్నామని, పనులు చకచకా సాగుచున్నాయని అన్నారు. అనాటమీ, లెక్చరర్ గ్యాలరీ, ల్యాబ్‌లు తదితర విభాగాలతో పాటు, విద్యార్థులకు వసతి గృహాలు, కామన్ ఏరియా పనులు పూర్తి చేస్తున్నామన్నారు. మిగిలిపోయిన చిన్న చిన్న త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు కళాశాల ప్రారంభానికి చేపట్టవలసిన పనులపై కాంటాక్టర్లకు పలు సూచనలు చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఏం.బి.బి.ఎస్. మొదటి సంవత్సరం ప్రవేశానికి వంద సీట్లు కేటాయింపు కాగా ప్రధానా చార్యులు వెంజటేశ్వర్ చాలా పారదర్శకంగా అడ్మిషన్స్ పూర్తిచేశారన్నారు. విద్యారు లు మంచిగా చదువుకునేలా చక్కటి వాతావరణం, వసతి గృహాలలో అన్ని మౌలిక సదుపాయాలూ కల్పిస్తున్నామని అన్నారు. అదేవిధంగా తరగతులు సక్రమంగా నిర్వహించేందుకు ల్యాబ్‌లో అన్ని ఎక్విప్మెంట్ ఏర్పాటుతో పాటు ఫ్యాకల్టీని, పరిపాలనా సిబ్బందిని నియమించామని అన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి కామారెడ్డి వైద్య కళాశాలలో చదువుకొనుటకు ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం విద్యార్థిని,విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్, గుత్తేదార్లు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ గేట్లు మూసివేత

- ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి ప్రవాహం తగ్గడంతో రాత్రి శనివారం 10.30 గంటల సమయంలో అన్ని గేట్లు మూసివేశారు. ఉదయం వేళ 8 గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని విడుదల చేయగా.. సాయంత్రానికి నాలుగుకు కుదించి.. రాత్రి వేళ అన్ని గేట్లను మూసివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్టు ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రాజెక్ట్ నుండి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 5 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 152 క్యూసెక్కుల నీటిని జౌట్ ఫ్లో ద్వారా విడుదల కొనసాగుతుందని వివరించారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు (90.313 టీఎంసీల) సామర్థ్యం కాగా, శనివారం సాయంత్రానికి పూర్తి స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుగా వుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

గ్రామాల వారీగా మత్స్య సహకార సొసైటీలు

- పాత సొసైటీలను విభజించి కొత్త సొసైటీలో ఏర్పాటు
- రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్




వినతిపత్రం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి (కామారెడ్డి)

త్వరలోనే గ్రామ గ్రామాన మత్స్య సహకార సొసైటీలు ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. ఆదివారం కామారెడ్డి పట్టణంలో జిల్లాస్థాయి మత్స్య సహకార సంఘం చైర్మన్ గ్రామ కమిటీ అధ్యక్షులు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన మత్స్యకార కుటుంబంలో ఒక్కరికైనా సొసైటీలో సభ్యత్వం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాత సొసైటీలను విభజించి కొత్తగా సొసైటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఆటంకాలు కలిగిస్తే చట్టపరమైన చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు. కామారెడ్డి జిల్లా నుండి గ్రామ గ్రామాన మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలు మత్స్య విప్లవాన్ని లక్ష్యంగా రాష్ట్ర ఫిషర్స్ పెడరేషన్ చేస్తుందన్నారు. కామారెడ్డి జిల్లాలో నీటి వనరులు సరిపోయినంత ఉన్న గ్రామాలలో సభ్యత్వం తక్కువ ఉందని నూతన సొసైటీ ఏర్పాటు చేస్తామన్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 220 మత్స్యపారిశ్రామిక సహకార సొసైటీలు ఉన్నాయన్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా నూతనంగా వృత్తి నైపుణ్యత పరీక్షలు పూర్తయిన మత్స్యకారులు అందరికీ వెంటనే సభ్యత్వమిప్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలలో ఘర్షణ వాతావరణం లేకుండా మత్స్యశాఖ, ఫెడరేషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్థిక స్వలంబన కోసం మత్స్యకారుల స్థితిగతులను తీర్చిదిద్దడానికి తెలంగాణ ప్రభుత్వం ఉన్నట్టు తెలిపారు.

సరిహద్దుల్లో 'చెక్'



సమావేశమైన ఇతర జిల్లాల, రాష్ట్రాల పోలీస్ అధికారులు

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి పకడ్బందీ చర్యలు
- నిజామాబాద్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ వెల్లడి
- ఇంటర్‌స్టేట్ బోర్డర్ పోలీసు అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్

నవతెలంగాణ-బోధన్

త్వరలో రాష్ట్రంలో జరుగబోయే ఎన్నికల దృష్ట్యా రాష్ట్రాల సరిహద్దులో జిల్లాల సరిహద్దులలో చెక్‌పోస్టులు చెకోపోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు మద్యం, డబ్బు ఇతర ఇల్లీగల్‌కు సంబంధించి అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్టు సీపీ వి. సత్యనారాయణ తెలిపారు. పోలీస్, ఎక్సైజ్, కమర్షలెక్స్, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, ఫారెస్టు, రెవెన్యూ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలూరా రోడ్డులో గల ఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో నిజామాబాద్ నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల్, రాజన్న సిరిసిల్ల, నాందేడ్ జిల్లా పోలీస్ అధికారులతో రాబోయే ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి ఇంటర్ స్టేట్ బోర్డర్ పోలీస్ అధికారులతో కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో నిజామాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఎలక్షన్ సమయంలో మద్యం, నగదు సరఫరా నియంత్రణ కొరకు చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో చెకోపోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టేలా చర్యలు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణ నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు, ఇరు రాష్ట్రల పోలీసులు పరస్పరం సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకొంటూ సాఫీగా ఎన్నికలు సాగేలా చూడాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి నిర్మల్, అదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల్, రాజన్న సిరిసిల్ల, నాందేడ్ జిల్లాలతో సరిహద్దులో ఉన్న సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని చెక్‌పోస్టులు నిరంతరాయంగా కొనసాగిస్తూ పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చెకోపోస్టులను సంబంధిత అధికారులు ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట (ఎన్.బి.డబ్ల్యూ) ల విషయంలో ఇరు జిల్లాలు, రాష్ట్రాల అధికారులు ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకెళ్లాలని తెలియజేశారు.

అంతర్ రాష్ట్ర చెకోపోస్టులు సాలూరా, కండ్గాన్, కందకుర్తి, పోతంగల్ వద్ద ఏర్పాటు చేయడం జరుగుతుం దని, అంతర్ జిల్లా చెకోపోస్టులు డొడ్గాన్ (సోన్), బ్రహ్మంగారి గుట్ట, సిరికొండ, ఇంద ల్వాయి టోలాజా, మల్లారం గండి, యంచ (బాసర) వద్ద చెక్పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతు ందని తెలియజేశారు. గతంలో మద్యం అక్రమ రవాణా తరచూ చేస్తూ పట్టుబడిన వారిపై కూడా నిఘా పెట్టి వారిని నియంత్రించే ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సరిహద్దుల్లో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రో లింగ్ పెంచాలని, సరిహద్దులో పోలీస్ అధికారులు వాట్సప్ గ్రూప్ లను ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పు డు సమాచారాన్ని తెలుసుకొని నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా ఎస్.పి డి. ఉదయయ్ కుమార్, నిర్మల్ జిల్లా ఎస్.పి. సి.హెచ్. ప్రవీణ్ కుమార్, జగిత్యాల జిల్లా ఎస్.పి భాస్కర్, కామారెడ్డి జిల్లా ఎస్.పి. బి. శ్రీనివాస్ రెడ్డి, నాందేడ్ జిల్లా (బోకర్) అదనపు ఎస్.పి డా కె.ఎ. ధరణి, నిజామాబాద్ అదనపు డిప్యూటీ పోలీస్ కమీషనర్ ఎస్. జయామ్, నిజామాబాద్ కమర్షల్ ట్యాక్స్ అధికారి లావణ్య, ఎక్సైజ్ సూపరింటెండెంటు కె. మల్లారెడ్డి, రెవెన్యూ అధికారులు, బోధన్ ఎ.సి.పి. నిజామాబాద్ ఎ.సి.పి, బాన్సువాడ ఎ.సి.పి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, సి.ఐ లు, ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన ద.మ రైల్వే జనరల్ మేనేజర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



రైల్వేట్రాక్‌ను పరిశీలిస్తున్న అధికారి అరుణ్‌కుమార్

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం నిజామాబాద్ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. క్రూ కంట్రోల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బంది బుకింగ్ లాబీ పనితీరును సమీక్షించారు. లోకో పైలట్లు గార్డులను విధుల కోసం బుక్ చేసిన క్రూ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఆయన పరిశీలించారు. రన్నింగ్ స్టాఫ్‌కు డ్యూటీకి బుక్ చేసుకునే ముందు సిబ్బంది విశ్రాంతి తీసుకునే గదులు వసతులపై దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సిబ్బందికి తగిన విశ్రాంతి ఉండేలా సిబ్బంది లింకులు సమర్థవంతంగా రూపొందించబడ్డాయని నిర్ధారిస్తూ, రన్నింగ్ స్టాఫ్‌ని డ్యూటీకి సరైన సమర్థవంతంగా వినియోగించేలా చూసుకోవాలని సూచించారు. సిబ్బంది రన్నింగ్ రూమ్‌ను కూడా ఆయన పరిశీలించారు, అందులో లోకో సిబ్బందికి అందించిన సౌకర్యాలను సమీక్షించారు లోకో పైలట్‌లతో సంభాషించారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని వినతి



నవతెలంగాణ-నవీపేట్

ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. మండల కేంద్రానికి కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా రఘునందన్ రావుతో మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ బిల్లు పెడతామని చెప్పిన విషయాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ గుర్తు చేశారు. పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానికోళ్ళ గంగాధర్, ఆకారం రమేష్, మారుతి, ప్రవీణ్, సుమన్, యమునా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన40మంది హాకీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను ఎంపిటిసి బాపూరావు తలారి, సర్పంచ్ జి నరేష్, ఉప సర్పంచ్ గొల్ల శ్రీనివాస్ ఇతరులతో కలిసి శనివారం పంపిణీ చేశారు. క్రీడాకారులకు ఒకే రకమైన దుస్తులు ఉండటం అభినందనీయమని తెలిపారు.

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 11న అంగన్వాడీలకు సంబంధించి తలపెట్టిన సమ్మెలో తాము పాల్గొనడం లేదని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ వెల్‌పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు తార తెలిపారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు, జేఏసీ చైర్మెన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జిల్లా డీడబ్ల్యూ అధికారిని రసూల్, ఆర్మూర్ ప్రాజెక్టు సిడిపిఓ భార్గవికి వినతి పత్రాలు అందజేసినట్టు తెలిపారు. ఈనెల 11 నుంచి ఇతర సంఘం యూనియన్లలో ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మెకు తమకు సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్, జిల్లా సలహాదారు చిట్టి నారాయణరెడ్డి, కేంద్ర బాధ్యులు శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇందిరా, జిల్లా కార్యదర్శి అనురాధ, కోశాధికారి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, చిత్రగౌతమి, బోధన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు మాలక్ష్మి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని ఇత్వర్‌పేట్ గ్రామంలో గురువారం జరిగిన దుర్ఘటనలో చనిపోయిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలను ఆదివాసి నాయకపోడు సంఘం జిల్లా నాయకులు శనివారం పరామర్శించారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమైనది అన్నారు. వారి కుటుంబాలకు ఆదివాసి పక్షాన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రూ.25వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ ఘటనపై తక్షణం స్పందించి ఆర్థిక సహాయం చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలలో బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచందర్, ప్రధాన కార్యదర్శి గంగ సాయన్న, జిల్లా నాయకులు లోలం గంగాధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో సిసి రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సుధా టిఫిన్ సెంటర్ నుండి నవోదయ స్కూల్ వరకు సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు మారినా నందిపేట్ మండల కేంద్రం మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని నేడు ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కృషితో నందిపేట్ మండల కేంద్రంలో వాడ వాడ నాణ్యత గల సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రధాన కూడళ్ల వద్ద ఐమాక్స్ లైట్లు, మరీ ముఖ్యంగా మండల కేంద్ర ప్రజల చిరకాల వాంఛా అయిన మెయిన్ రోడ్డు సెంటర్ లైటింగ్, డ్రైనేజీ, రోడ్డు పనులను కూడా ప్రారంభించినట్టు తెలిపారు. కులమత రాజకీయాలతో పబ్బం గడుపుకునే వారికి-అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం పనిచేసే వారికి ప్రజలు తేడా గమనించాలని, పనిచేసిన వాళ్లకే ఓటు అడిగే దమ్ము ఉంటుందని, అది బీఆర్ఎస్ ప్రభుత్వానికే ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మచ్చుర్ల సాగర్, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ హుస్సేన్, ఉప సర్పంచ్ భరత్, వార్డు మెంబర్ మాన్పూర్ భూమేష్, గంధం సాయిలు, ఎస్ జి తిరుపతి, సీనియర్ నాయకులు సిలిండర్ లింగం, ఎర్రం ముత్యం, ఎర్రం మురళి, బజరంగ్ చౌహాన్, పట్టణ అధ్యక్షులు కొత్తూరు భాస్కర్, శ్రీకాంత్, నరేష్, గంగాధర్, మెకానిక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన వీర హనుమాన్ ఆలయ నిర్మాణం

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని కోస్లీ శివారు వ్యవసాయ క్షేత్రంలో వీర హనుమాన్ ఆలయ నిర్మాణం పూర్తయి సోమవారం విగ్రహ ప్రతిష్టాపన చేయనున్నట్లు ఆలయ నిర్మాణకర్త ముప్వ నాగేశ్వరరావు శనివారం తెలిపారు. నిర్మాణ ప్రారంభ దశలో ఎల్కే ఫారంలో కొందరు ఉద్దేశపూర్వకంగా అతి పురాతన ఆలయాన్ని కూల్చివేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. అన్ని అవాంతరాలు దాటి అంగరంగ వైభవంగా ఆదివారం ఐదుగురు అర్చకులతో హెూమాధి కార్యక్రమాలు నిర్వహించి సోమవారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అందరికీ అందుబాటులో న్యాయసేవలు



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- మొత్తం 16,360 కేసుల పరిష్కారం
- జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

నవతెలంగాణ-కంఠేశ్వర్

అన్ని వర్గాల ప్రజాసమూహాలకు ప్రజా న్యాయపీఠాల ద్వారా సమ న్యాయం అందించడమే న్యాయసేవల చట్టం ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో శనివారం జాతీయలోక్ అదాలత్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారు. న్యాయవ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థలు కలిసికట్టుగా తమ బాధ్యతలను నిర్వహిస్తేనే న్యాయం నాలుగు పాదాలమీద నడిచి సామాన్యుడి చెంతకు చేరుతుందనేందుకు లోక్ అదాలత్‌ల విజయమే తార్కాణమని ఆమె పేర్కొన్నారు. బీమా కంపెనీలు, మోటారు రోడ్డు ప్రమాద బాధితులు ఒక అంగీకారానికి రావడం మూలంగా యాభై ఎనిమిది దావాలలో 4 కోట్ల 84 లక్షల 18 వేలకు అవార్డులు జారీ చేయడానికి అవి బాధిత కుటుంబాలకు ఆర్థిక స్వాలంభనకు దోహదపడుతుందని ఆమె అన్నారు. అందరికి అందుబాటులో న్యాయసేవలు అందించడానికి న్యాయసేవాధికార సంస్థ శ్రమిస్తున్నదని తెలిపారు. చట్టాల ద్వారా సమకూరే అన్ని రకాల ప్రయోజనాలు ప్రజల దరికి చేరవేయడానికి వ్యవస్థలు సమిష్టి కృషి చేయాలని జిల్లా జడ్జి కోరారు. లోక్ అదాలత్‌లు అనేవి నిరంతర ప్రక్రియ అని అన్ని పనిదినాలలో పని చేస్తుందని తెలిపారు. న్యాయం అందని ద్రాక్ష కాదనే వాస్తవాన్ని అందరికీ తెలియజేద్దామని, అందరికి అందుబాటులో న్యాయసేవలు ఉన్నాయని ఆమె గుర్తు చేశారు.

న్యాయార్థులకు సంపూర్ణ సహకారం..

న్యాయం కోసం పరితపిస్తున్న ప్రతివారికి సంపూర్ణ సహకారం, సహాయం అందజేస్తామని పోలీస్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. స్నేహపూర్వక పోలీసింగ్, బాధితులైన, ముద్దాయిలు అయినా ఎవరి హక్కులకు హాని రానియబోమని ఆయన తెలిపారు. ప్రజలకోసం నిర్వహిస్తున్న ప్రజా న్యాయపీఠాలకు జిల్లా పోలీసు శాఖ తన బాధ్యతగా బాధ్యతల బరువును మోస్తుందని అన్నారు.

న్యాయవ్యవస్థకు, కార్యనిర్వాహక శాఖ తోడ్పాటు..

జిల్లా న్యాయవ్యవస్థకు, జిల్లా కార్యనిర్వాహక శాఖ తోడ్పాటును అందించి కలిసికట్టుగా నడుస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ భాగస్వామిగా జిల్లా అధికార యంత్రాంగం ఎల్లప్పుడు న్యాయార్థుల పక్షమేనని ఆమె వెల్లడించారు. న్యాయసేవాధికార సంస్థ చేపడుతున్న ప్రతి కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్నదని, న్యాయం న్యాయార్థులకు త్వరితగతిన అందించడంలో న్యాయవాదులు అగ్రభాగాన ఉంటారని బార్ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ తెలిపారు. అదనపు జిల్లా జడ్జిలు కనకదుర్గ, షౌకత్ జహన్ సిద్ధికి తమ సందేశంలో లోక్ అదాలత్‌ల నిర్వహణలో ప్రగతికి, అభ్యున్నతికి అనే లక్ష్యాలను పెనవేసుకున్నదని తెలిపారు. న్యాయసేవ సంస్థ లక్ష్యాలను సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బు ఉపాధ్యాయ్, గోపీ కృష్ణ, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌లు సయ్యద్ ఖదీర్, ఉదయ కుమార్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ రహీమొద్దీన్, న్యాయవాదులు మానిక్ రాజు, మహమ్మద్ షాదుల్లా, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తం 16,135 కేసుల పరిష్కారం..

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 16,135 సివిల్, క్రిమినల్ కేసులను కక్షిదారుల అభిమతం మేరకు పరిష్కరించినట్లు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి తెలిపారు. ప్రభుత్వ రంగసంస్థల బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న ఋణగ్రహీతలు, బి.ఎస్.ఎన్.ఎల్ వినియోగదారుల కేసులు 213 పరిష్కరించి కోటి రూపాయలకు పైగా ఆర్థిక లబ్ది చేకూరేవిధంగా అవార్డులు జారీ చేసినట్లు తెలిపారు. మోటారు రోడ్డు ప్రమాద నష్ట పరిహార దావాలు 58 లలో భీమా కంపెనీలు, బాధితులు రాజీపద్ధతిన పరిష్కరించబడి దాదాపు పదికోట్లకుగాను అవార్డులు అందుకున్నారని తెలిపారు.

జనం మాట.. బీఆర్ఎస్ బాట

- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సకల జనం బీఆర్ఎస్ బాట పట్టారని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అభివర్ణించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం నియోజకవర్గంలో వివిధ పార్టీలు, ప్రజా, కుల సంఘాలకు చెందిన వేలాదిమంది ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామానికి చెందిన వీడీసీ ప్రతినిధులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, డొంకేశ్వర్ మండలం గంగాసరం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, మాక్లూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు, చిన్నాపూర్ గ్రామ మైనారిటీ సోదరులతో పాటు పలు కుల సంఘాల సభ్యులు, ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన కుమ్మరి సంఘం సభ్యులు, ఆర్మూర్ పట్టణంలో మామిడిపల్లి ఎస్ఎస్‌కే సర్వసమాజ్ సభ్యులు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అంకాపూర్‌లోని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నివాసంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం ఇస్తామన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌లో చేరిన వారు "దేశ్ కీ నేత కేసీఆర్, జై తెలంగాణ, జై జీవనన్న, ఆర్మూర్ అడ్డా కేసీఆర్ గడ్డ" అని చేసిన నినాదాలతో అంకాపూర్ ప్రాంతం దద్దరిల్లింది. గులాబీ తీర్థం పుచ్చుకున్న వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో అద్భుతమైన ప్రగతి సాధించేలా గొప్పగా పాలిస్తున్న కేసీఆర్ ప్రభుత్వ ప్రగతిశీలక ఆలోచనా విధానం పట్ల తామంతా ఆకర్షితులమై ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే జీవనన్న నాయకత్వంలో పని చేయాలని బీఆర్ఎస్‌లో చేరినట్టు తెలిపారు. వారినుద్దేశించి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం ఇస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమానికే ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు పట్టం కడుతున్నారని ఆయన తెలిపారు. 'ఆర్మూర్ అంటేనే రైతులు, చేతి వృత్తులకు ప్రసిద్ధి. నియోజకవర్గం ప్రగతి బాటలో పరుగులు పెడుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో అష్టకష్టాలు పడిన రైతులకు కేసీఆర్ పాలన అన్నదాతలకు స్వర్ణ యుగం తెచ్చింది. రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా, చెరువుల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ముఖ్యంగా పోచంపాడును నీటికుండల మార్చడం, గుత్ప ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవడం, చెక్ డ్యామ్‌లు నిర్మించడం వంటి కార్యక్రమాలతో రైతాంగం కుదుట పడేలా చేశాం. ఆర్మూర్ నియోజకవర్గం చేతి వృత్తులకు పెట్టింది పేరు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా కూలిపోయిన కుల వృత్తులకు మళ్లీ ప్రాణం పోసే కార్యాక్రమాలు అమలు జరుగుతున్నాయి. చేతివృత్తులకు ప్రభుత్వం బాసటగా నిలిచి జవసత్వాలు ఇస్తోంది. చెరువుల్లో చేపల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపట్టి మత్స్యకారుల జీవితాలకు వెలుగునిచ్చాం. రజక, నాయీబ్రాహ్మణ వృత్తులకు ఉచితంగా విద్యుత్ సరఫరా జరుగుతోంది. బీసీ వర్గాలకు చెందిన కులవృత్తులకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక చేయూతనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 3వేల ఇండ్ల నిర్మాణానికి రూ.3లక్షల చొప్పున నిధులు ఇవ్వబో తున్నాం. ఇప్పటికే ఆర్మూర్ నియోజకవర్గంలో 8వేల మంది యాదవ సోదరులకు గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. ఎస్సీ సోదరులకు దళితబంధు ఒక వరం. కేసీఆర్‌కు సకల కులాలు సమానమే. అందుకే అన్ని కులాలకు ప్రభుత్వం ఆత్మగౌరవ భవ నాలు నిర్మిస్తాం. ఆర్మూర్ నియోజకవర్గానికి అద్భుత అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధించి ప్రగతి పథంలో నడిపిస్తున్నా. రూ.20కోట్లతో సిద్దుల గుట్టకు ఘాట్ రోడ్డు, ఆర్మూరు అభివృద్ధికి అద్దం పట్టేలా తొమ్మిదికి పైగా బైపాస్ రోడ్ల నిర్మాణం, అర్బన్ పార్క్ నిర్మాణం వంటివి నేను సాధించిన విజ యాలు. కేసీఆర్ కాకుండా ఎవరొచ్చినా తెలంగాణకు ముప్పే. ఎటు చూసినా కారు, సారు, కేసీఆరే. మళ్లీ మళ్లీ విజయం బీఆర్ఎస్‌దే. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా చరిత్ర సృష్టించడం ఖాయం. మళ్లీ నేనే గెలుస్తా. జీవితమంతా మీకు తోడుగా నిలుస్తా" అని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు

పండగలను ఘనంగా నిర్వహించి ఐక్యతను చాటాలి

- అదనపు డీసీపీ జయరాం



మాట్లాడుతున్న అదనపు డీసీపీ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో నిర్వహించే పండగలను కులమతాలకతీతంగా ఘనంగా నిర్వహించి పట్టణవాసులు తమ ఐక్యతను చాటాలని అదనపు డీసీపీ జయరాం అన్నారు. శనివారం బోధన్ బైపాస్ రోడ్డు సమీపంలో గల ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బోధన్ డివిజన్ శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 950 గణేష్ విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారని అన్నారు. ఈనెల 28వ తేదీన గణేష్ శోభాయాత్ర అలాగే మిలాద్ ఉల్ నబీ పండగలు ఒకేరోజు ఉన్నందున హిందువులు, ముస్లింలు శాంతియుతంగా పండగలు జరుపుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 12:30 వరకు మైనార్టీ సోదరులు వారి ప్రార్థనలు, ర్యాలీలు ముగించాలని అనంతరం 2 గంటల నుంచి గణేష్ శోభాయాత్ర కార్యక్రమాలు జరుగుతాయని కావున కులమతాలకతీతంగా ఒకరికొకరు సహకరించుకుంటూ పండగలు జరుపుకోవాలని సూచించారు. ఆర్డీవో రాజగౌడ్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా బోధన్ పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా కావలసిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అక్కడ ప్రతి శాఖ నుండి సంబంధిత సిబ్బందిని నియమిస్తామని ఎలాంటి ఇబ్బందులున్నా వారి సహకారం కోరాలన్నారు. అనంతరం సమావేశానికి వచ్చిన ప్రముఖులు సూచించిన సమస్యలను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పరిష్కరిస్తామన్నారు. గణేష్ శోభాయాత్ర సందర్భంగా రహదారుల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు పోటీ పడవద్దని అనుమతులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఇంచార్జ్ ఏసిపి రవీందర్‌రెడ్డి, తహసిల్దార్ గంగాధర్, సిఐలు ప్రేమ్ కుమార్, శ్రీనివాస్‌రాజ్, జయేష్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు బాగారెడ్డి, గుమ్మల అశోక్‌రెడ్డి, యూనూస్, ప్రవీణ్ మహారాజ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

- మధ్యంతర భృతి ప్రకటించాలి
- పెండింగ్ బకాయిలు, డీఏలు విడుదల చేయాలి
- ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మల్క జనార్ధన్

నవతెలంగాణ-భీమ్‌గల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల వేతన సవరణ గడువు జూన్ 30న ముగిసిందని, కావున రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా వెంటనే వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటన చేసి చాలా రోజులు గడుస్తున్నా ఇంకా ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయలేదని, వేతన సవరణ సంఘాన్ని నియమించలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి ఉన్న మూడు విడతల డీఏలను వెంటనే విడుదల చేయాలని ఆయన పేర్కొన్నారు. అలాగే మంజూరై సంవత్సర కాలంగా ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ తక్షణం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో బదిలీలు, పదోన్నతులు నిర్వహిస్తున్న సందర్భంలో కోర్టు తీర్పు త్వరగా వచ్చే విధంగా చూసి, పండితులు పీఈటీలకు కూడా పదోన్నతులు ఇవ్వాలని, ప్రభుత్వం మంజూరు చేస్తానన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని, సిపిఎస్ విధానం రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వాన్ని పిఎఫ్ఆర్డీఏ రద్దుకు డిమాండ్ చేయాలని, జాతీయ విద్యా విధానం 2020ని తిరస్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమగ్రశిక్షా అభియాన్ సిబ్బంది చేస్తున్న ఆందోళనను దృష్టిలో పెట్టుకొని వారికి కనీస వేతనం ఇచ్చి, వారి సర్వీసులను రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల విషయంలో ఉన్న ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని, ఉపాధ్యాయ పోస్టులను తగ్గించటం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నష్టదాయకమని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దారం గంగాధర్‌కు బాల సాహిత్య అవార్డు



అవార్డు అందుకుంటున్న దారం గంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెందోట బాల సాహిత్య పీఠం సిద్దిపేట వారి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ నందు శనివారం బాల సాహిత్య అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా నుంచి ప్రముఖ రచయిత దారం గంగాధర్ ఎంపిక అవగా శనివారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కీర్తి పురస్కార గ్రహీత, ప్రముఖ బాల సాహితీవేత్త సంగన్నభట్ల చిన్నరామకిష్టయ్య చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట సాహితీ వేత్తలు ఇతర జిల్లాల రచయితలు, నిజామాబాద్ జిల్లా కవులు స్వర్ణ సమత, తోగర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పదవి ఉందని అహంకారంతో చేస్తే ఊరుకోం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదవి ఉందని అహంకారంతో ఏది పడితే అది చేస్తే ఊరుకోమని టీడీపీ నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి దేగం యాద గౌడ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిజామాబాద్ పార్లమెంట్ తరఫున తీవ్రంగా ఖండించారు. టీడీపీ నిజామాబాద్ పార్లమెంటు అధ్యక్షులు దేగాం యదాగౌడ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ఏపీ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఒకవైపు లోకేష్ పాదయాత్రలో అశేష జన నీరాజనం చూసి, మరోవైపు చంద్రబాబు నాయుడు చేస్తున్న రోడ్ షోలు చూసి వచ్చే పబ్లిసిటీనీ చూసి, వచ్చే ఎలక్షన్లలో ఓడిపోతానని భయపడి అక్రమ అరెస్టుకు పన్నాగం పన్నారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి అయిన అతనిని దొంగలాగా అర్ధరాత్రి అరెస్టు చేయడం వెనక కుట్ర దాగి ఉందని అన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఏమాత్రం మచ్చ లేకుండా ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని అన్నారు. పదవి ఉందని అహంకారంతో ఏది పడితే అది చేస్తే ఊరుకోమని, దీనిని ప్రజానికం గమనిస్తుందని అన్నారు. లక్షల కోట్ల అవినీతి చేసి వైయస్ జగన్మోహన్ జైల్లో ఉండి వచ్చాడని, నేను అధికారంలో ఉన్నప్పుడేనా చంద్రబాబు నాయుడుని ఒక్కరోజైనా జైల్లో ఉంచాలని అహంకారంతో ఈ దుస్సాహసానికి ఒడిగట్టారని మండిపడ్డారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ అభివృద్ధికి తిప్పాపూర్ గ్రామానికి చెందిన సిద్ధరామ్ రెడ్డి సూర్యప్రభ రిటైర్డ్ ఉపాధ్యాయులు 11,111 రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రతిమను, తీర్థప్రసాదాలు అందజేశారు.

కాగా శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా భక్తులు ఉదయం నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అధికారులు అన్నదాన కార్యక్రమం, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

పౌష్టికాహార వారోత్సవాలు


అక్షరాభ్యాసం చేయిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట్, వెంకటాపూర్ గ్రామాల్లో శనివారం అంగన్వాడి కేంద్రాల్లో పోషక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు పలు రకాల సూచనలు చేశారు. గర్భిణీలకు రక్తహీనత సమస్యలు, దాన్ని అదిగమించేందుకు తీసుకోవాల్సిన సంతులిత పౌష్టికాహారంపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా చిన్నపిల్లలకి చిరుధాన్యాలు గుడ్లు ఆకుకూరలు వంటివి ఎక్కువ తీసుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్వాడి కేంద్రాల్లో సామూహిక సీమంతం, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ సర్పంచ్ సురేఖ, ఆరోగ్య సిబ్బంది ఇందిరా, మంజుల, హసీనా తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ స్ఫూర్తిగా
సామాజిక సమస్యలపై కవితలు రాయాలి

- **ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు**

నవతెలంగాణ-విలేకరులబృందం

జిల్లా వ్యాప్తంగా కాళోజి నారాయణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాష దినోత్సవం నిర్వహించారు. కాళోజి రచనల స్ఫూర్తితో సామాజిక సమస్యలపై స్పందించి కవితలు రాయాలని సూచించారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవ సందర్భంగా కాళోజి జయంతి ఉత్సవాలు జ్యోతి ప్రజవలన చేసి ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు కాళోజి రచనల స్ఫూర్తితో సామాజిక సమస్యలపై స్పందించి కవితలు రాయాలని ఆమె అన్నారు. ఈ సదస్సులో 9వ తరగతి చెందిన విద్యార్థి సరయు కాళోజీ జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎస్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జీవితమే ఉద్యమంగా ఉద్యమమే జీవితంగా పెనవేసుకుని పోయిన విశిష్ట వ్యక్తి కాళోజి అని అన్నారు. అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు అనడం కాళోజీకే చెల్లిందని ప్రజల భాషలో ప్రజా కవిత్వాన్ని వెలువరించాడన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు


నిజాంసాగర్‌లోని నవోదయ స్కూళ్లో..


భిక్కనూర్‌లో


సదాశివనగర్‌లో..

తెలంగాణ బాషా దినోత్సవ వేడుకలు

సదాశివనగర్: తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్, కామారెడ్డి నందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రాధిక అధ్యక్షతన, తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు , అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. శనివారం కాళోజి చిత్రపటానికి పూలమాలలతో కార్యక్రమాన్ని ప్రారంభించి తెలంగాణ యాసకు, భాషకు పట్టం కట్టిన కాళోజి నారాయణరావు రచనలను గుర్తు చేసుకుంటూ వారిని సంస్మరించుకున్నారు. కళాశాల బృందమంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

భిక్కనూర్: మండలంలోని సిద్ధి రామేశ్వర నగర్ గ్రామంలో శనివారం తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో కాలోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కాలోజీ నారాయణరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జనగామ శ్రీనివాస్, ఉపసర్పంచ్ రాజంపేట లతా సుధాకర్, ఎంపీటీసీ మీనా దుర్గా బాబు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్, గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యులు ప్రభాకర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు

కాళోజీ సాక్షిగా సేవలను గుర్తించాలి



భిక్కనూర్: తెలంగాణ ప్రజాకవి కాలోజీ నారాయణరావు సాక్షిగా తమ సేవలను గుర్తించాలని కాంట్రాక్టు ప్రొఫెసర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ఆయనవకు పూలమాల తో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1445 మందిని కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరిని రెగ్యులరైజ్ చేసి తమకు న్యాయం చేయాలని కాళోజి జయంతి సందర్భంగా విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తాము శాంతియుత పోరాటం చేస్తున్నామని తమ బాధలను అర్థం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాలాద్రి, డాక్టర్ సునీత, శ్రీకాంత్,దిలీప్ పాల్గొన్నారు.

పోసానిపేటలో పోషణ మాస వారోత్సవాలు


పోషక విలువలపై అవగాహన

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో శనివారం భోజనముస వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు సామూహిక సీమంతం నిర్వహించారు. పోషక విలువలపై అంగన్వాడీ టీచర్లు తల్లులకు, బాలింతలకు, కిశోర బాలులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరులు గీ రెడ్డి మహేందర్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, ఆశ వర్కర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో మున్సిపల్ 6వ వార్డు ఇంద్రనగర్ కాలనీలో శిథిలావస్థలో నివసిస్తున్న మార్లు సంగవ్వ(60) కుటుంబాన్ని ఆదుకోవాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఇంటిని పరిశీలించారు. ఆమె నివాసం ఉంటున్న ఇల్లు భారీ వర్షాల వల్ల ఇంటి పై కప్పు ముందు గోడ కూలిందని, అధికారులు, పాలకులు స్పందించి ఆమెకు డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ ఎల్లారెడ్డి పట్టణ కమిటీ అదక్ష్యులు మార్లు సాయిబాబ, యం ఆర్ పి యస్ రాష్ట్ర నాయకులు పద్మారావు బహుజన నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు శనివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన బిజెపి నాయకులు వెంకటరెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కామారెడ్డి బిజెపి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకటరమణారెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల బిజెపి అధ్యక్షులు రమేష్ రెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

మొక్కుబడిగానే ఐలమ్మకు నివాళి అర్పిస్తారా..?

నవతెలంగాణ-తాద్వాయి

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నా కానీ రాష్ట్ర ప్రజాప్రతినిధులు అధికార పక్షం వారైనా ప్రతిపక్షం వారైనా ఐలమ్మ విగ్రహం మెడలో దండ వేయడానికి కనీసం ముందుకు రావడం లేదు గ్రామపంచాయతీ మండల కార్యాలయాల వద్ద కూడా మొక్కుబడిగానే చేస్తున్నారని జిల్లా చాకలి ఎస్సీ సాధన సమితి అధ్యక్షుడిగా రాష్ట్ర రజక సంఘం రజక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ సిహెచ్ రాజయ్య పేర్కొన్నారు. నేడు వర్ధంతి పురస్కరించుకొని ఈసారి కూడా మొక్కుబడిగానే నివాళి అర్పిస్తారా శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గత రెండు మూడు సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాలను కనీసం ఈ సంవత్సరమైనా ప్రజాప్రతినిధులు ప్రతిపక్షాల వారు కచ్చితంగా నివాళులర్పించాలని డిమాండ చేశారు. రాష్ట్రంలో 15 లక్షల పైచిలుకు జనాభా ఉన్నప్పటికీ కూడా చట్టసభల్లో మాత్రం అనగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో 119 సీట్లున్నప్పటికీ ఒక రజక చాకలి బిడ్డ కూడా అసెంబ్లీలో లేకపోవడం సిగ్గుచేటు అని, పార్లమెంటులో కూడా తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో రజకులను ఎస్సీలకు గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎందుకంటే.. దేశంలోని 18 రాష్ట్రాలలో మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో చాకలి కులస్తులను ఎస్సీలుగా గుర్తించారని, తెలంగాణ సిద్ధించి పది సంవత్సరాలు గడుస్తున్నా రజకులను ఎస్సీలకు గుర్తించడం లేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజకులను చేరదీయకుంటే.. రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్తామని స్పష్టంచేశారు.

తుక్కోజివాడిలో హనుమాన్ పండుగ

నవతెలంగాణ-సదాశివనగర్


ఉట్టికొట్టేందకు యువకుల పోటీ

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని తుక్కోజివాడి గ్రామంలో శనివారం హనుమాన్ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ పండుగను ప్రతి సంవత్సరం నాగులపంచమి రోజు నుండి హనుమాన్ దేవాలయంలో భజనలు చేస్తారు. అలాగే గ్రామంలోని అన్ని దేవాలయాలలో సాయంత్రం దీపరాధన చేస్తామని తెలిపారు. 21 రోజుల తర్వాత శుక్రవారం రోజు నాడు శనివారం వరకు 24 గంటల పాటు భజనలు చేస్తారు. శనివారం ఆలయం జెండా ఏర్పాటు చేసి ఉట్లు కట్టారు. ఉట్టి కొట్టే పండుగ నిర్వహించారు.

పలువురు బాధితులకు ఆర్థిక సహాయం



కిట్లు అందజేస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-లింగంపేట్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయిన పేదలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లింగంపేట్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేసినటుట మండల ఐ ఆర్ సి ఎస్ అధ్యక్షులు శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని చాకలి దేశ్ పేట్ బాలవ్వకు చెందిన నివాసపు ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా కూలిపోవడంతో హైజెనిక్ కిట్‌తో పాటు వంట సామాగ్రి, నగదుతో ఆర్థిక సహాయం అందజేసినట్టు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సందీప్ కుమార్, ప్రవీణ్ కుమార్, ప్రభాకర్, శంకర్, రవీందర్, పాల్గొన్నారు.

మంచి పశువైద్యుడిని..
అన్యాయంగా డిప్యూటేషన్‌పై పంపారు

- **యాథావిధిగా మేనూర్‌కే నియమించాలి :బీఆర్ఎస్ నాయకులు**

నవతెలంగాణ-మద్నూర్


మాట్లాడుతున్న నాయకులు

మద్నూర్ మండలంలోని మేనూర్ పశువైద్య డాక్టర్‌గా విధులు నిర్వహించే బండి వార్ విజయ్‌ను అన్యాయంగా డిప్యూటేష్ పేరుతో బదిలీ చేయడం సరైంది కాదని, పాడి రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే వైద్యుడిని తిరిగి మేనూర్‌కే పంపాలని అధికార పార్టీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. స్థానికంగా ఉండే పశువైద్యునికి ఆకస్మికంగా ఎవరో కంప్లైంటు చేయడం డిప్యూటేషన్ పేరుతో ఇక్కడి నుండి బీర్కూరు మండలానికి బదిలీ చేశారని, పశువులకు ఎలాంటి రోగం వచ్చిన అర్ధరాత్రి అయిన వచ్చి చికిత్సలు అందించే మంచి డాక్టర్‌ను బదిలీ చేయడం సరికాదని అన్నారు. అలాంటి డాక్టర్‌ను మళ్లీ మేనూర్ గ్రామానికి వచ్చే విధంగా జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతుషిండే, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను కోరనున్నట్టు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బస్సీ పటేల్, మద్నూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ పాకల వార్ విజయ్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు సురేష్ ఉపాధ్యక్షులు షేక్ గఫర్ వీరితో పాటు పలు గ్రామాల సర్పంచులు తెలిపారు. బండివార్ విజయ్ పశువులకు చికిత్సలు అందించడంలోనే కాకుండా స్వచ్ఛంద సేవలో పాల్గొంటూ అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని అలాంటి వ్యక్తిని బదిలీ చేయడం సరైంది కాదని, తిరిగి మేనూర్‌కు రప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు.

పాడి పశువుల పోషణపై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్


అవగాహన కల్పిస్తున్న అధికారి

భిక్కనూర్ మండలంలోని గుర్జకుంట గ్రామంలో శనివారం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాడి పశువుల పోషణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి రాజేశ్వర్ మాట్లాడుతూ నాణ్యమైన పాల దిగుబడి, పాలలో ఉన్న వెన్న శాతం పెరిగే విధానం, హెడ్జ్ లోసర్ గడ్డిలో లభించే పోషక విలువలు అధికంగా ఉంటాయని, లోసర్ గడ్డిని పశువులకు మేతగా ఎంచుకోవాలని పాడి రైతులకు సూచించారు. నాణ్యమైన పశుగ్రాసం నేపియర్, సూపర్ నేపియర్, హెడ్జ్ లూసర్, ఆజోల్ల లాంటి గడ్డి విత్తనాలను ఎంచుకోని పశువులకు పెట్టే మేతలో ఎండు గడ్డి, పచ్చి గడ్డి, తౌడు, దానలో మినరల్ మిక్సర్ పెట్టాలని, ఎల్లప్పుడు పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం సర్పంచ్ మనోహర రమేష్ రెడ్డి మాట్లాడుతూ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయంలో వివిధ సబ్సిడీలు కల్పిస్తూ ఆర్థికంగా రైతులను అభివృద్ధి చేస్తున్నందుకు గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల డైరీ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, మోహన్ రెడ్డి, రామిరెడ్డి, ప్రభాకర్, రాజిరెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఫెసిలిటేటర్ భూపతి, తదితరులు పాల్గొన్నారు.

మెటల్ రోడ్డు వేశారు.. తారు మరిచారు

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని ఉత్నూర్ నుండి వజ్జపల్లి గ్రామం వరకు మెటల్ రోడ్డును వేశారు. కానీ దాని పైన తారు వేయడం మర్చిపోయారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు వేసి సంవత్సరాలు గడిచినా రోడ్డును పట్టించుకోకుండా పోవడం సరికాదని అన్నారు. ఉత్నూర్ నుండి వజ్జపల్లి వరకు సుమారుగా ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉండవచ్చని తెలిపారు. మెటల్ తేలడంతో కంకర ఉండడంతో నడిచి వెళ్లేందుకు, ద్విచక్ర వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. వజ్జపల్లి గ్రామ ప్రజలు ప్రతి పనికి ఉత్నూర్‌కు రావాల్సి ఉంటుంది. బ్యాంకుకు ప్రాథ మిక సహకార సంఘం వెళ్లేందుకు, శనివారం సంతకు, ఎరువులు, యూరి యా కోసం వెళ్లేందుకు ఇతరాత్ర పను లకు, గాంధారిలోని పీహెచ్‌సీకి వెళ్లేందు కు ఈ రోడ్డే దిక్కని.. పాలకులు మారినా రోడ్డు గతి మాత్రం మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారత వాణిజ్య కమిషనర్‌గా వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్


నియమితులైన వినయ్‌రెడ్డి

పలు దేశాలకు భారత వాణిజ్య కమిషనర్‌గా డాక్టర్ వినయ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నియామక ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం అందజేసింది. న్యూఢిల్లీలో జరుగుతున్న జీ 20 సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ నియమించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలానికి చెందిన భూమి రెడ్డి కుమారుడు వినయ్ రెడ్డి న్యూఢిల్లీలో పలు హెూదాలలో కొనసాగుతున్నారు. ఆయన అందిస్తున్న సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది బ్రెజిల్, లాటిన్, అమెరికన్ కరేబియన్, దేశాలకు భారత వాణిజ్య కమిషనర్ గా నియమించారు. భారతదేశం నుండి ఆయా దేశాలకు 20 రకాల వస్తువులు ఎగుమతులు దిగుమతులపై పూర్తి అధికారం ఆయనకు ఉంటుందని పేర్కొన్నారు. భారత వాణిజ్య కమిషనర్ గా డాక్టర్ వినయ్ రెడ్డి నియమితులు కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.


పండుగలు శాంతియుతంగా చేసుకోవాలి


మాట్లాడుతున్న సీఐ తిరుపతయ్య

నవతెలంగాణ-రాజంపేట్

పండుగలను శాంతియుతంగా చేపట్టుకోవాలని సిఐ తిరుపతయ్య సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన శాంతియుత సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే విగ్రహాల వివరాలు పోలీసులకు అందించాలని, విగ్రహాల నిమజ్జనంలో భాగంగా శాంతియుతంగా నిమర్జనం చేయాలని ఆయన తెలిపారు. అనంతరం ఎస్సై సంపత్ మాట్లాడుతూ... ప్రధాన కూడళ్లో వహనాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంత వాతావరణంలో పండగ నిర్వహించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నల్లవెల్లి అశోక్, సీనియర్ నాయకులు ఆముదాల నాగరాజు, అంద్యాల రమేష్, నరేష్, ఏఎస్ఐ గంగారెడ్డి గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మత్స్య సహకార చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న ముదిరాజ్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్ర మత్స్య సహకార చైర్మన్ పిట్టల రవీందర్‌ను పలువురు ముదిరాజ్ కులస్తులు శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో సన్మానించారు. లింగంపేట్ మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బట్టు విట్టల్, లింగంపేట్ మండల అధ్యక్షులు సాయికుమార్, సాయికిరణ్, మనోజ్ సంద బాలయ్య, మార్గం సాయిలు, దాసరి పరువయ్య రమేష్ చంద్రయ్య రవి రాజు. కిష్టయ్య గ్రామాల గ్రామం కమిటీ అధ్యక్షులు మత్స్య సహకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు
- అంగన్వాడీల సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

అంగన్వాడీ ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త సమ్మె పోస్టర్లను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, నాయక్ వాడి శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శివ రాజమ్మ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని, ఐసిడిఎస్ పరిరక్షణ డిమాండ్లతో ఈనెల 11వ తేదీ నుండి సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాత, మాధవి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

విలేకరి కుటుంబాన్ని పరామర్శించిన వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన విలేఖరి గోలి పురుషోత్తం, సోదరుడు గోలి దిలీప్ తండ్రి గోలి ఆనందం, అనారోగ్యంతో నిజామాబాద్ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గత 15 రోజుల క్రితం మృతి చెందడంతో శనివారం ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆయన అనుచరులతో కలిసి పురుషోత్తం కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలి

- ఆర్డీవో వినోద్ కుమార్


మాట్లాడుతున్న ఆర్డీవో

నవతెలంగాణ-ఆర్మూర్

ఓటరు తుది జాబితా వెలువరించే తేదీ నాటికి స్వీకరించిన అన్ని దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని రెవిన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌ఓలకు ఓటర్ నమోదు ప్రక్రియ, ఓటరు జాబితా పరిశీలనపై పున సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉందని, నిర్ణీత ఫారాల్లో పూర్తి వివరాలు రాసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు తుది జాబితా, విచారణ తర్వాత చేర్పులు సవరణలపై ముందస్తు చర్యలపై బీఎల్‌ఓలకు శిక్షణనిచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డీ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు


నవీపేట్ : కేక్ తినిపిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నవీపేట్

బోధన్ నియోజకవర్గ బిజెపి నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కేక్ కట్ చేసి శనివారం వేడుకలు నిర్వహించారు. మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మేడిపాటి ప్రకాష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు సరిన్, ప్రధాన కార్యదర్శులు ఆనంద్ రామకృష్ణ, రాజేందర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ సుధాకర్, ఎంపిటిసి రాధా, సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్, పిల్లి శ్రీకాంత్, రచ్చ సుదర్శన్, రాము, భాను గౌడ్, రాజశేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల పరిధిలో గల సాటాపూర్ గేట్ వద్ద బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ శైలేష్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి కరణ్‌రెడ్డి, పోచారం సర్పంచ్, ఎడపల్లి బీజేపీ మండలాధ్యక్షులు కోలా ఇంద్రకరణ్, గోపి కృష్ణ, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : బోధన్ నియోజకవర్గం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అంగరంగ వైభవంగా ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలికలకు నోట్ బుక్స్, పెన్నులు, పండ్లు, పంపిణీ చేశారు. చిన్నారుల మధ్యలో తన జన్మదిన వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, రెంజల్ మండల అధ్యక్షులు గోపికృష్ణ, సుధాకర్ చారి, స్థానిక నాయకులు మేక సంతోష్, ఎల్.కిషోర్, ఖ్యాతం యోగేష్, కరణ్‌రెడ్డి, బుజ్జి, చుక్క రాజుగౌడ్, రచ్చ సుదర్శన్, అజయ్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల యాజమాన్యం, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.


ఎడపల్లి : కేక్ కట్ చేస్తున్న వడ్డీమోహన్‌రెడ్డి

బాధిత కుటుంబాలను పరామర్శించిన సునీల్ కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


బాధిత కుటుంబాలను ఓదారుస్తున్న సునీల్‌కుమార్

మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ శనివారం పరామర్శించారు. హాసకొత్తూర్‌లో గ్రామానికి చెందిన రాకేష్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను పరామర్శించి వైద్య ఖర్చుల కొరకు రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన దేశాయ్ ముత్తెన్న, ఏనుగు నర్సింలు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఇనాయత్‌నగర్‌కు చెందిన గైని శ్రీనివాస్ కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాలెపు నర్సయ్య, పడిగల ప్రవీణ్, తెడ్డు రమేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

13న ధర్నాను జయప్రదం చేయండి

- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా
- ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న మల్యాల గోవర్ధన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం సమావేశాన్ని జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు కేరళ తరహాలో రోజుకు 600 రూపాయల చొప్పున నెలకు 18 వేల రూపాయల కనీస వేతనాలను తెలంగాణ ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 8 కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గంగాధర్, నాయకులు సురేందర్‌రెడ్డి, పర్వావ్వ, తుకారం నాయక్, నాగమణి, బాలరాజు, రేఖ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలి

- సీఆర్‌పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాస అంజయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని సీఆర్‌పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాస అంజయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాశాఖలో అంతర్భాగమైన సమగ్ర శిక్షలో గత 15 నుంచి 20 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో వెట్టిచాకిరీ చేస్తూ మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కన్నా చాలా తక్కువ జీతాలు తీసుకుంటూ విద్యా శాఖను పటిష్టం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. చాలా సంవత్సరాల నుంచి ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు అనేక రకాలుగా తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందించామని తెలిపారు. కానీ ఇప్పటివరకు సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎటువంటి లాభం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ చెప్పినట్లు.. 'కష్టాలు వచ్చినప్పుడు రోడ్డు ఎక్కాలి సమస్యలను సాధించుకోవాలి.. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు మనం రోడ్డు ఎక్కకపోతే మనకు మన తెలంగాణ స్వరాష్ట్ర కల నెరవేరకపోతుండే' అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకున్నామన్నారు. ఆయన మాటల స్ఫూర్తితో గత 10 రోజులుగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో శాంతియుత నిరసన దీక్షలు చేస్తూ వినూత్న కార్యక్రమాలతో ప్రభుత్వాన్ని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఎన్టీఆర్ చౌక్ వద్ద శాంతియుత రిలే నిరసన దీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఒడిశా, హర్యానా, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేశారని వివరించారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగులకు రూ.10లక్షలు, వికలాంగులైన ఉద్యోగులకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని, రెగ్యులర్ ప్రక్రియ ముగిసేవరకు మినిమం టైం స్కేల్‌ను ప్రకటించాలని, ఉద్యోగులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనే తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

ఎస్ఎస్ఏ రిలే దీక్షలకు.. ఏఐఎఫ్‌డీఎస్ సంఘీభావం

నవతెలంగాణ-కంఠేశ్వర్


సంఘీభావం తెలుపుతున్న ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు

ఎస్ఎస్ఏ రిలే దీక్షలకు అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (ఏఐఎఫ్‌డీఎస్) నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. గత వారం రోజుల నుంచి చేపట్టే రిలే దీక్షలను న్యాయమైన డిమాండ్లను గుర్తించి, వారి దీక్షలకు సంఘీభావం తెలిపినట్టు పేర్కొన్నారు. అలాగే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఎక్కడి వేసినా గొంగళి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వివరించారు. సమగ్ర సర్వశిక్ష అభియాన్ పరిధిలోని ఉద్యోగుల రిలే దీక్షలే చక్కటి ఉదాహరణ అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ మాటలు ఎటుపాయే అని నిలదీశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు ఏమీ కోరడం లేదని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేస్తూ, సమాన పనికి సమాన వేతనం, మహిళ ఉద్యోగినీలకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని న్యాయమైన కోరికలు కూడా తీర్చలేని స్థితిలో తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఉండడం దౌర్భాగ్యమైన స్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా ఉద్యమాలకు, ప్రజలు విద్యార్థులు, ఉద్యోగుల ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా నాయకులు గోపాల్, సాయి, గణేష్, నితీన్, సాయికిరణ్, మహేష్, ప్రతిక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న ముప్కాల్ కేజీబీవీ ఎస్వో

నవతెలంగాణ-ముప్కాల్


అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని మాధవనగర్‌లో చేపట్టిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి జ్ఞాపికలను అందజేస్తూ ఘనంగా సన్మానించారు. ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎస్వో (స్పెషల్ ఆఫీసర్)గా విధులు నిర్వర్తిస్తున్న జి.వినోద రాష్ట్రస్థాయి బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ బాబురావు చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వినోదను పలువురు అభినందించారు. ముప్కాల్ కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ గవర్నర్ వి.లక్ష్మీ, సభ్యులు నగేష్, అమర్‌నాథ్ రావ్, జిల్లా చైర్మన్ చాకు లింగం, ముప్కాల్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, సెక్రటరీ కట్ట మహేష్, ట్రెజరర్ జక్కుల రాము తదితరులు పాల్గొన్నారు.

15న ఛలో హైదరాబాద్

- బీఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న దండి వెంకట్

బీడీ కార్మికులకు జీవనభృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహ ధర్నాలో బీడీ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ పిలుపునిచ్చారు. గత రెండు ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం బీడీ కార్మికులకు జీవనభృతి ఇస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ విస్మరించిందని దండి వెంకట్ ఆరోపించారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బీఎల్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 15 జరిగే మహాధర్నాలో బిజెపి, బీఆర్ఎస్ రాజకీయ పార్టీలు మినహా అన్ని వామపక్ష, రాజకీయ పార్టీలు హాజరవుతున్నాయని, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా అధ్యక్షులు కె.మధు, నగర అధ్యక్షులు టి.రాజు పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రావును కలిసిన జీజీహెచ్ సూపరింటెండెంట్

నవతెలంగాణ-కంఠేశ్వర్


రాజేశ్వర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతిమరాజ్

క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ డి.రాజేశ్వర్‌రావును నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసి ప్రతి ఒక్కరికి న్యాయం చేసే దిశగా కృషి చేయాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-ఏర్గట్ల


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మండల కేంద్రంలోని ఎస్సి బాలుర వసతి గృహంలో మండల ప్రాథమిక వైద్యశాలకు చెందిన వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులను అందించారు. అనంతరం చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ, డయేరియా, టైఫాయిడ్ రోగాలు ఏ విధంగా వ్యాపి చెందుతాయి, దానికి గల కారణాలను వివరించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మారుతి, హాస్టల్ వార్డెన్ రాము, హెల్త్ అసిస్టెంట్ పండరీ, ఏఎన్ఎం కల్పన ఆశాలు పాల్గొన్నారు.

హనుమాన్ మందిరంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని గాడిలా హనుమాన్ మందిరంలో నాలుగో శనివారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని యువత, హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రావణ మాసం పురస్కరించుకొని గత నాలుగు వారాలుగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెంజల్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం పైడి రాకేష్‌రెడ్డి దరఖాస్తు


దరఖాస్తు చేసుకుంటున్న రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోసం తెలంగాణ బీజేపీ కార్యాలయంలో శనివారం ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోసం శనివారం దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేపై పోరాటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేపై 50 వేల మెజార్టీతో ఓడిస్తానని అన్నారు. ప్రతి గ్రామంలో ఇల్లు, విద్యా వైద్యం అందడమే తన ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. బడుగు బలహీన పేదప్రజల సంక్షేమానికై నిర్విరామ కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లె గంగారెడ్డి, కూతురు సుచరితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న నాయకులు

జగన్ పాలన.. ప్రజాస్వామ్య వ్యతిరేకం

నవతెలంగాణ-పర్కి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ అక్రమ అరెస్ట్ చేయించటం సిగ్గు చేటని బాన్సువాడ టిడిపి ఇంచార్జి కరాటే రమేష్ అన్నారు. జగన్ పాలన ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ఉందని ఆయన విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఎన్.టీ.ఆర్ చౌరస్తా వద్ద చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం జగన్‌కు, ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జగన్ పాలన ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కొనసాగుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బి.విఠల్, షమిసుదీన్, టౌన్ ప్రెసిడెంట్ అంబం సాయిలు, శ్రీను, వినోద్, వెంకటేష్, మేస్త్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ రికవరీ.. బాధితునికి అందజేత


సెల్‌ఫోన్ అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నాలుగో పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఫిర్యాదు చేయగా పోలీసులు ఫోన్‌ను రికవరీ చేసి ఆ బాధితునికి నాలుగవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సంజీవ్ శనివారం తెలిపారు. ఎస్సై సంజీవ్ వివరాల ప్రకారం.. గత నెల 4న మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంఐ 11 లైట్ ఫోన్

బీఆర్ఎస్‌లో 100 మంది చేరిక


బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని కల్లెడ గ్రామంలోని కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు సుమారు 100 మంది ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో శనివారం చేరారు. డేగ రాజేశ్వర్, డేగ భార్గవ్, మచ్చ సురేష్‌గౌడ్, పద్మశాలి కుల సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మనీష్, వైస్ చైర్మన్ రమేష్, బిఆర్ఎస్ నాయకులు సుక్కి సుధాకర్, గ్రామ అధ్యక్షులు చిన్నా రమేష్, అనిల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చందూర్‌లో హెూంగార్డ్‌పై పోకిరీల దాడి



దాడి జరిగిన ప్రాంతంలో ప్రజలు

నవతెలంగాణ-వర్ని
చందూర్ మండల కేంద్రంలో శనివారం సాయంత్రం కొందరు పోకిరీలు యువతిలను ఆట పట్టిస్తుంటే వారు 100కు ఫోన్ చేశారు. దీంతో స్పందించిన వర్ని పోలీస్‌స్టేషన్ హెూంగార్డ్ వారికి అండగా నిలబడి పోకిరీల నుంచి కాపాడారు. ఇది సహించని పోకిరీలు ప్రజలు చూస్తుండగా తాగిన మైకంలో హోంగార్డుపై దాడి చేశారు. ప్రక్కనే ఉన్న కల్లుబట్టిలోనికి ప్రాణ రక్షణ కోసం వెళ్లినా వదలలేదు. ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలానికి పోలీస్ వ్యాను రావటంతో పోకిరీలు సద్దుమణిగారు. అప్పటికే హెూంగార్డ్‌ను కొట్టినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులపై పోకిరీలు బూత్ మాటలతో దూషించారు. చివరకు గ్రామప్రజలు చొరవ తీసుకోవటంతో పోలీసులు శాంతించారు.

సమస్యలు పరిష్కరించండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్
- బతుకమ్మ పేర్చి ర్యాలీ, ప్రదర్శన

నవతెలంగాణ-కంఠేశ్వర్
నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు బతుకమ్మ ఆడి "ఉయ్యాలో ఉయ్యాలో.. కేసీఆర్ ఉయ్యాలో.. మమ్ములను రెగ్యులర్ చెయ్యు ఉయ్యాలో.. కరోనా సందర్భంగా ఉయ్యాలో.. మా ప్రాణాలను పణంగా పెట్టిన ఉయ్యాలో మమ్ములను గుర్తించయ్య ఉయ్యాలో" అంటూ పాటలు పాడుతూ.. నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని యుపిహెచ్‌సీ, యుసిహెచ్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పారామెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని చాలా కాలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నామని తెలిపారు. వీరందరికీ కనీస వేతనం, డీఎ, హెచ్ఏ తదితర అలవెన్సులు నిర్ణయించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనాలు అమలు కాకుండా తక్కువ వేతనాలు పొందుతున్న కేడర్లలో అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బంది, అకౌంటెంట్స్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్స్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ (కమ్యూనిటీ ఆర్గనైజర్స్), సపోర్టింగ్ స్టాఫ్లోని మెడికల్ అసిస్టెంట్స్, వాచ్మెన్, స్వీపర్స్, బస్తీ దవఖానాలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు, సపోర్టింగ్ స్టాఫ్ అలాగే బ్లడ్ బ్యాంక్ డిఇఓ, ల్యాబ్ అటెండర్, ఎస్ఎన్సీయు సిబ్బంది, ఎంసిహెచ్ హాస్పిటల్స్‌లోని ఓటి అసిస్టెంట్లు, సెక్యూరిటీ గార్డ్స్, సపోర్టింగ్ స్టాఫ్, ఆర్ఎఎస్కి మెడికల్ ఆఫీసర్లు, ఫార్మాసిస్టులు, ఏఎన్ఎంలు, డ్రైవర్లు, ఆయుష్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఎస్ఓ, ఎఫ్ఎస్, డిఎసిస్, ఎన్‌సిడీ, టిబి లెప్రసీ, ఎస్ఆరెస్, టిడి హబ్, సిహెచ్ కంటింజెంట్ తదితర విభాగాలలో పనిచేస్తున్న వారందరూ తక్కువ వేతనాలు పొందుతున్నారని తెలిపారు. వీరందరికీ వారి కేడర్ ప్రకారం వైద్య, ఆరోగ్య శాఖలోని పర్మినెంట్ ఉద్యోగుల బేసిక్, అలవెన్సులు నిర్ణయించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె ద్వారా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షాదుల్లా, సెక్రెటరీ వెంకటేష్ పటేల్, రమేష్, ఎర్ర మురళి, మహమ్మద్ హుస్సేన్, గంగారాం, వందన, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మలతో ర్యాలీ చేపడుతున్న దృశ్యం

గొర్రెల మందపై కుక్కల దాడి

- 14 గొర్రెలు మృత్యువాత
- రూ.లక్ష 50 వేలు ఆస్తి నష్టం

నవతెలంగాణ-ఎడపల్లి
గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 14 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరో పది గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఎడపల్లి గ్రామానికి చెందిన నవీన్, ఐలయ్య, శేఖర్ అనే వ్యక్తికి చెందిన సబ్సిడీ గొర్రెల మందపై రెండు రోజుల క్రితం అర్ధరాత్రి కుక్కలు దాడి చేశాయి. దీంతో 14 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరికొన్నింటికి తీవ్ర గాయాలు కాగా మండల పశు వైద్యులు వాటికి వైద్యం అందించారు. ఈదాడిలో సుమారు రూ.లక్షా యాభై వేల ఆస్తినష్టం వాటిల్లింది.


దాడిలో మృత్యువాతపడిన గొర్రెలు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానం పొందిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోధన్
లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం సందర్భంగా శనివారం కమ్మ సంఘ భవనంలో ఉపాధ్యాయులు రాజా, ప్రసాద్‌గౌడ్, గంగాధర్, హలీం, సుజాత, రేణుక, అరుణ, సాయగౌడ్, శైలేష్, పద్మలత, రవి, సాయిలు, ఉమాదేవి, శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ బోధన్ డివిజన్ ఇంచార్జి శంకర్, రుద్రూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్ వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

పదిమంది విద్యార్థులను దత్తత తీసుకున్న గుమ్మడి ఫౌండేషన్


దత్తత తీసుకున్న వారితో ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-కోటగిరి
మండ లంలోని ఎక్లాస్‌పూర్ క్యాంపులో గుమ్మడి ఫౌండేషన్ నిర్వాహకులు గుమ్మడి శ్రీధర్ వారి కుమారుడు సారిష్ రాజ్ పేరు మీదుగా అనాథ పిల్లలకు వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా శనివారం జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆదేశాలతో 20 మంది విద్యార్థులకు ఈ సంవత్సరం విద్యాబుద్ధులతోపాటు వసతి గృహ సౌకర్యం కల్పించేందుకు ముందుకు రావడంతో పదిమంది విద్యార్థులను జెడ్పిటిసి శంకర్ పటేల్ సమక్షంలో విద్యార్థులు చేర్చుకొని వారికి విద్యాబుద్ధులు అందించడానికి ముందుకువచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, అంబరసింగ్, ఫౌండేషన్ సభ్యులు హరిబాబు, రాము, మధుకర్ పాల్గొన్నారు.

11న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

- పోస్టర్లు ఆవిష్కరణ


వర్ని : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/వర్ని
అంగన్వాడీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 11 నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహించటానికి సిద్ధమైన సందర్భంలో సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడీ జిల్లా గౌరవాధ్యక్షులు ఏ రమేష్ బాబు తెలిపారు. శనివారం పట్టణంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి అధికారులు, ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నారని ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టి ఉద్యోగులందరూ ఐక్యంగా తమ హక్కుల కోసం సమ్మెలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధానంగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీసం నెలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్‌కు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు చెల్లించాలని, సగం పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ ఆర్మూర్ ప్రాజెక్టు అధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి గోదావరి, నాయకులు జగదాంబ, అరుణ, సునంద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

వర్ని(మోస్రా) :
అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 11 నుంచి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మె చేపట్టనున్నామని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. శనివారం మోస్రా మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనం నడపొద్దు

- పోలీస్ కళాజాత బృందం


అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాబృందం

నవతెలంగాణ-డిచ్‌పల్లి
మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనం నడపద్దని, అనుకోని ఘటనలు ఏదైనా జరిగితే కుటుంబానికి ఎనలేని దు్ఃఖం, భాద మిగల్చవద్దని పోలీస్ కళాజత బృందం సభ్యులు శ్రీనివాస్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీస్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆటోవాలలకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవలే చోటుచేసుకున్న ఘటనలను ఉదహరించారు. మద్యం, సెల్‌ఫోన్ అతి ప్రమాదాలకు కారణమవుతున్నాయని, దీంతో అభం శుభం తెలియని వారెందరో మరణిస్తున్నారని, మరికొందరు గాయాలపాలవుతున్నారని చెప్పారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అలాంటి వాటితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పాట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అమాయక ప్రజలను మభ్యపెడుతున్నారని వాటన్నింటినీ నమ్మవద్దని పేర్కొన్నారు. ఏదైనా సహాయ సహకారాలు కావాలన్నా పోలీసులను సంప్రదించాలని, ఎలాంటి అపోహలకు గురికాకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అతి వేగం ప్రాణాల మీదకు తెస్తుందని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా రాకపోకలు సాగించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఇది ప్రాణానికి రక్షణగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాజత బృందం సభ్యులు విక్రం, శేఖర్, భాష, సీతతో పాటు, ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఆటోవాలాలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బతుకంతా తెలంగాణ కోసమే..

- పనిచేసిన వ్యక్తి కాళోజీ..
- జయంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం
పుట్టుక, చావు కాకుండా బతుకంతా తెలంగాణ కోసం పనిచేసిన వ్యక్తి కాళోజీ నారాయణరావు అని పలువురు అన్నారు. తెలంగాణ ప్రజా కవి కాళోజీ నారాయణ 99వ జయంతి వేడుకలను పలుచోట్ల శనివారం నిర్వహించారు.

డిచ్‌పల్లి :కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ యూనివర్సిటీలో ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ.. పుట్టుక, చావు కాకుండా.. బతుకంతా తెలంగాణ కోసం పనిచేసిన వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. రాజకీయ, సామాజిక చైతన్యాన్ని తీసుకువస్తూ నిజాం నిరంకుశ పాలనకు, అదేవిధంగా తెలంగాణ భావజాలాన్ని విస్తరించడానికి రచనల ద్వారా నిరంతరం ప్రయత్నించారని ఆయన కొనియడారు. తన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అనేక అవార్డులు ఇచ్చి ఒక ఆరోగ్య యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టినట్టు తెలిపారు. కాళోజి జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని సైతం జరుపుకుంటున్నామని వివరించారు. తెలంగాణలోని ప్రతి ఒక్కరూ కాళోజీ రచనలు చదువుతూ సామాజిక తెలంగాణ కోసం ఉద్యమం చేయవలసిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివకుమార్, ఆదర్శ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


డిచ్‌పల్లిలో నివాళి..

నందిపేట్ : తెలుగు భాషను, యాసను ప్రపంచానికి చాటాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని జేఏసీ నాయకులు గంగన్న, సిలిండర్ లింగం అన్నారు. మండల కేంద్రంలోని కాళోజి 110వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ప్రజలకు ఏ ఆటంకం ఉన్నా.. అక్షరాలతో మాటలతో వాటిని ఖండించే వాడని గుర్తుచేశారు. తెలంగాణ కోసం విద్రోహుల గుండెల్లో నిలిచి ప్రజల మనిషి అయ్యాడని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోషన్ సయ్యద్ హుస్సేన్, బాలగంగాధర్, లక్కంపల్లి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


నందిపేట్‌లో..

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-బాల్కొండ
బాల్కొండ మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన 3కుల సంఘాలకు చెందిన 64 కుటుంబాలు మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. బాల్కొండ నియోజవర్గంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను ఆకర్షితులై రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి వైపు మా ఓటు అంటూ బాల్కొండ మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన సరికెల వారి మున్నూరుకాపు సంఘం నుంచి 28 కుటుంబాలు, ఆదివాసీ నాయకపోడ్ సంఘం నుంచి 22 కుటుంబాలు, విశ్వబ్రాహ్మణ సంఘం నుంచి 14 కుటుంబాలు మొత్తం 64 కుటుంబాలు శనివారం నాగపూర్ బీఆర్ఎస్ నాయకులకు తీర్మానం పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు కుల సంఘాల్లో 64 కుటుంబాల నుంచి 18 సంవత్సరాలు నిండిన ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి ఓటు వేస్తామని ప్రమాణం చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు తెలిపారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలు మరవకుండా మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించేందుకు నాగపూర్ గ్రామ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించేందుకు పూర్తిమద్దతు పలుకుతామని వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటు లింబాద్రి, ఎంపీటీసీ సభ్యులు ఈపీ నారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు ఎంబరి నర్సయ్య, ఉపసర్పంచ్ ఎంబరి మహిపాల్, నాయకులు పోలేపల్లి లక్ష్మీ నారాయణ, మాజీ సర్పంచ్ నల్లూర్ చిన్నయ్య, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


తీర్మానపత్రాలను అందజేస్తున్న కుల సంఘాలు

నేడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి

నవతెలంగాణ-బాల్కొండ/ముప్కాల్
మండల పరిధిలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని బాల్కొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బద్దం ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్కొండ మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం శంకుస్థాపన కార్యక్రమం, అలాగే 6 లక్షల వ్యయంతో నూతన గోసంగి సంఘం భవనం శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని బద్దం ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

ముప్కాల్ : మండలంలోని నల్లూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రానున్నట్టు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ సామ పద్మ వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నల్లూర్ గ్రామంలో రూ.1.70 కోట్లతో నూతనంగా నిర్మించిన 33/11 కె.వి సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ముప్కాల్-నల్లూర్ గ్రామాల శివారులో ఉన్న నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్-82పై రూ.14 లక్షల రూపాయలతో మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పలు సంఘ భవనాలకు ప్రొసీడింగ్స్ కాపీలు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన వివిధ కులసంఘాల భవనాల నిర్మాణాల నిధుల ప్రొసీడింగ్ కాపీలను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం అందజేశారు. వేల్పూర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈ మేరకు నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఆయా కులసంఘాల సభ్యులకు మంత్రి అందజేశారు. బషీరాబాద్‌లో ఎర్రగొల్ల యాదవ సంఘం-1 కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.4.50 లక్షలు, కుర్మ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.5లక్షలు, దళిత మాదిగ సంఘం-1కు రూ.6లక్షలు, చౌట్‌పల్లిలో దళిత మాల సంఘంకు రూ.6లక్షలు, కుమ్మరి సంఘం-2కు రూ.3లక్షలు, కుర్మ సంఘం రూ.6లక్షలు, గొల్ల యాదవ సంఘంకు రూ.5లక్షలు, హాసకొత్తూర్‌లో గౌడ సంఘంకు రూ.5లక్షలు, యాదవ సంఘం-2కు రూ.4.50 లక్షలు, యాదవ పెద్ద సంఘంకు రూ. 6లక్షలు, వడ్డెర జాతీయ సైన్య సంఘంకు రూ.6లక్షలు, కోనాపూర్‌లో గురడి కాపు రెడ్డి సంఘంకు రూ.7లక్షలు, కుర్మ యాదవ సంఘంకు రూ.5లక్షల నిధుల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, కమ్మర్‌పల్లి సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్, సర్పంచులు మారు శంకర్, సక్కారం అశోక్, దయ దేవయ్య, సింగల్ విండో చైర్మన్ కుంట ప్రతాప్, రైతుబంధు సమితి గ్రామ కో ఆర్డినేటర్ కొమ్ముల రాజేందర్, నాయకులు రాజా గౌడ్, ఏనుగు గంగారెడ్డి, బోడ దేవేందర్, బైకాని మహేష్, పాలెం రవి కిరణ్, సదుల రాజన్న పాల్గొన్నారు.


ప్రొసిడింగ్ కాపీల కార్యక్రమంలో మంత్రి

ఉత్తమ ఉపాధ్యాయులుగా డి.ప్రభాకర్

నవతెలంగాణ-కోటగిరి
మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ కోటగిరి ద్వారా 2023 సంవత్సరానికి గానూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320డీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం మాధవ్‌నగర్ కమ్మ సంఘం భవనంలో కోటగిరి గ్రామానికి చెందిన ప్రభాకర్ 25 సంవత్సరాల నుంచి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధన అందిస్తూ సేవ చేయడంతో అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు, గవర్నర్ లక్ష్మీ బసవేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణమోహన్, లయన్స్ క్లబ్ సెక్రెటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ కొడాలి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువగా ధరకే వడ్లను విక్రయించాలి

మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్
ప్రభుత్వం వడ్లను కొనుగోలు చేసిన ధర కంటే ఎక్కువ ధరకే విక్రయించాలని మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మాజీ మంత్రివర్యులు సుదర్శన్ రెడ్డి వారి నివాసంలో పత్రిక సమావేశం నిర్వహించి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలని అప్పుడే రైతులు సంతోషంగా ఉంటారని భావించి 560 రూపాయలు ఉన్న వడ్ల ధరను 1400 రూపాయలకు ప్రభుత్వమే కొనుగోలు చేసిందని అన్నారు. 430 రూపాయలు ఉన్న మక్కల ధరను 1200 రూపాయలు చేసిందని, ఒకవేళ ప్రభుత్వం కాకుండా వ్యాపారులు రైతుల దగ్గర నుండి వడ్లు, మక్కలు కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర ఇవ్వరని భావించి కొనుగోలు సెంటర్లు ప్రారంభించి వడ్లు కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని ఆయన అన్నారు. కానీ ప్రస్తుతం ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంతోషాన్ని నీరుగారుస్తూ కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన వడ్ల కొనుగోలు వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షులు తాహేర్ బిన్ హందన్, మాజీ ఎమ్మెల్సీ అరికేళ నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతి రెడ్డి రాజరెడ్డి పాల్గొన్నారు.